# నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
3 | నిజామాబాద్, సోమవారం 7 అక్టోబర్ 2024 | KAMAREDDY


వివాదాస్పదంగా మారిన ఓ పోలీస్ అధికారి తీరు



# ఆయన రూటే సెపరేటు!

## హోటల్ నుంచి కిరాయి ఇంట్లోకి మకాం..

ఉద్యోగ విధుల్లో భాగంగా ఏ అధికారి అయినా సొంతంగా గూడును సర్దుబాటు చేసుకోవడం పరిపాటి. స్థానికంగా ఉన్న వనరుల ఆధారంగా వెసులుబాటు కల్పించుకుంటారు. కమిషనరేట్‌లో ఓ విభాగానికి ఏసీపీగా వచ్చిన అధికారి మాత్రం ఇందుకు విరుద్ధం. తాను ఏసీపీ ర్యాంకు అధికారిని అనే భావనతో నగరంలో పేరు మోసిన హోటల్‌పై కన్నేశాడు. ఖాకీ పేరుతో ఒక ఏసీ గదిని తీసుకొని, దానిని తన ఇంటి గదిగా మార్చుకుని అందులో తిష్టవేశాడు. ఇలా రోజుల తరబడి సదరు అధికారికి హోటల్ యాజమాన్యం కూడా సౌకర్యాలను కల్పిస్తూ వచ్చింది. నయా పైసా లేకుండా రాచమర్యాదలు చేసింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసు ఉన్నతాధికారి ఆగ్రహం వ్యక్తంచేయడంతో సదరు అధికారి హోటల్ గదిని ఖాళీ చేశాడు. ముబారక్‌నగర్ వెళ్లే దారిలో ఓ ఇంట్లో అద్దెకు దిగి వసతి పొందుతున్నాడు. ఇన్నిరోజుల పాటు ఖాకీ యూనిఫాం పేరుతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ రాచ మర్యాదలు పొందిన విషయం .. పోలీసు ఉన్నతాధికారికి తెలిసేసరికి ఖాళీ చేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఈ ఏసీపీ స్థాయి అధికారికి స్థానిక ఠాణా పోలీసులు సైతం వంత పాడడం గమనార్హం. హోదాకు గౌరవం ఇచ్చి భయంతో వణికి పోతూ మర్యాదలకు కొదువ లేకుండా చూశారు. జిల్లాకు వచ్చిన కొత్తలో ఏడో బెటాలియన్‌లోనూ ఆశ్రయం పొందినట్లు సమాచారం. ఓ ఉన్నతాధికారి జోక్యం చేసుకొని నోటీసులు జారీ చేయడంతో పలాయనం చిత్తగించాల్సి వచ్చింది.

## సామాన్యులే బలి

పోలీస్ కమిషనరేట్‌లో డయల్ –100 నంబర్‌కు సరైన సమాధానం ఇవ్వకపోతే ఓ ఎస్సై తన పోస్టును పోగొట్టుకున్నాడు. చివరకు ఓ ఠాణాలో మరో ఎస్సై సైతం ఎఫ్ఐఆర్ నమోదులో నిర్లక్ష్యం, జాప్యం వెలుగు చూడడంతో అటాచ్ చేయబడ్డాడు. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా మంది పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లు ఉన్నతాధికారుల ఆగ్రహానికి గురవడంతో కమిషనరేట్‌లో భయం పట్టుకున్నది. క్రమశిక్షణా చర్యలు ఎక్కువివ్వడంతో పనితీరులో పారదర్శకత రెట్టింపు అయ్యింది. అయితే సామాన్య ఖాకీలపై ఎడాపెడా చర్యలు తీసుకునే ఉన్నతాధికారులకు ఏసీపీ స్థాయి అధికారుల లీలలు బాహాటంగానే కనిపిస్తున్నప్పటికీ శాఖాపరమైన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించడం ఏమిటి? అంటూ కింది స్థాయిలోని పోలీస్ సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. తమకో న్యాయం, ఉన్నతాధికారులకో న్యాయమా? అంటూ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. హెల్మెట్ లేకపోతేనే రూ.130 చలానా ఇంటికి పంపించి వేధించే ఖాకీలకు.. సొంత శాఖలో అరాచకాలు కనిపించడం లేదా? అని ప్రజలు సైతం ప్రశ్నిస్తున్నారు.

## యాజమాన్యం బరితెగింపు!

ఏసీపీ బస చేసిన హోటల్‌లోనే ఈ మధ్య దాడులు జరిగాయి. హైటెక్ వ్యభిచారం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు వెలుగు చూశాయి. ఒక్కసారిగా నగర వాసులు హతాశులయ్యారు. హోటల్ యాజమాన్యం బరితెగింపునకు కారణం ఏమిటి? అన్న ప్రశ్నకు సదరు ఏసీపీ అభయమే అని ప్రచారం జరుగుతోంది. తాను ఈ హోటల్‌లో ఉండగా ఎవరూ దాడి చేయలేడంటూ చెప్పుకోవడంతో సదరు హోటల్ యాజమాన్యం కూడా విచ్చలవిడిగా గదులను కిరాయికి ఇచ్చి దందాను నడిపించినట్లు సమాచారం. నిఘా వర్గాల ద్వారా అసలు తంతును పోలీస్ ఉన్నతాధికారి తెలుసుకోవడంతో ఏసీపీ బస చేసిన హోటల్‌పైనే దాడి చేయించాడు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయించి అత్యంత రహస్యంగా హోటల్‌పై దాడి చేయించి అసాంఘిక కార్యకలాపాల గుట్టును రట్టు చేయించాడు. విషయం తెలుసుకున్న సదరు అధికారి ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. హోటల్‌లో తాను చేస్తున్న ఆగడాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించిన విషయాన్ని గ్రహించి, చేసేది లేక తప్పును సరిదిద్దుకునే పనిలో పడ్డాడు. సీసీటీవీ ఫుటేజీలు సైతం కమిషనరేట్ ఉన్నతాధికారికి చేరాయి. పలు సెటిల్మెంట్లు జరిగినట్లు వినికిడి. ఏసీపీ నేతృత్వం వహిస్తున్న విభాగంలోని కానిస్టేబుళ్లు సైతం సదరు అధికారి తీరుతో విసుగు చెందుతున్నట్లు సమాచారం. ఇందులో పనిచేస్తున్న ఒకరిద్దరు కూడా ఏసీపీ తీరును చూసి గాడి తప్పుతున్నారన్న విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. ఆ విభాగాన్ని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్న వాదన పెరుగుతోంది.

- స్టార్ హోటల్లోనే రోజుల తరబడి తిష్ట
- తప్పని తెలిసినా.. సహకారం అందించిన స్థానిక పోలీసులు
- ఇటీవల కిరాయి ఇంటికి మార్చిన మకాం
- కమిషనరేట్‌లో ఓ ఏసీపీ వ్యవహారంపై జోరుగా చర్చ...
- చిన్నోళ్లకు ఓ న్యాయం, ఏసీపీకి మరో న్యాయమా? అంటున్న ఖాకీలు

*క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచే పోలీసుశాఖలో కొందరి వ్యవహారశైలి ఆ శాఖ పరువును బజారుకీడుస్తున్నది. నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఓ ఏసీపీ స్థాయి అధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ సెటిల్మెంట్ల దందాకు తెరలేపినట్లు సమాచారం. ఏకంగా నగరంలోని ఓ హోటల్లో తిష్టవేశాడు. ఏసీ గదిని ఖాకీ పేరుతో అద్దెకు తీసుకొని అక్కడి నుంచే రాచకార్యాలు వెలగబెట్టాడు. ఈ విషయం తెలుసుకున్న ఉన్నతాధికారి ఆగ్రహం వ్యక్తం చేయడంతో సదరు అధికారి హోటల్‌కు గుడ్‌బై చెప్పి అక్కడి నుంచి ఓ కిరాయి ఇంట్లోకి మకాం మార్చాడు. ఇంతచేసినా సదరు ఏసీపీపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.*

*–నిజామాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

**గడిచిన** ఏడాది కాలంలో చాలా మంది ఖాకీలు శాఖాపరమైన చర్యలకు బలికాగా.. చిన్నపాటి నిర్లక్ష్యానికి మెమోలు, సస్పెన్షన్లు, బదిలీలు, అటాచ్‌మెంట్లు ఇలా నానా రకాలుగా ఇక్కట్లు ఎదుర్కొన్నారు. హోంగార్డుల నుంచి పైస్థాయి వరకు అందరూ మిన్నకుంటూ పనిచేసుకుంటూ పోతున్నారు. నిర్లక్ష్యం జరగకుండా, తప్పులు వెలుగు చూడకుండా ప్రతిక్షణం అప్రమత్తంగా ఉంటూ శాంతి, భద్రతల పరిరక్షణలో నిమగ్నమవుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను తప్పకుండా పాటిస్తూ సలాం కొడుతున్నారు. పోలీసులు తమ పనితాము చేసుకుంటుండగా.. కమిషనరేట్‌లో ఓ ఏసీపీ స్థాయి పోలీస్ అధికారి తీరు తీవ్ర దుమారం రేగుతోంది. ఉన్నత స్థాయిలో ఉన్న సదరు అధికారి ఆగడాలు రోజురోజుకూ శ్రుతి మించుతున్నాయి. ఇష్టానుసారంగా వ్యవహరించడంతో ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదులు అందుతున్నాయి. కానీ సదరు అధికారిపై ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. కింది స్థాయిలోని ఖాకీలు అనుకోకుండా తప్పు చేస్తే తీవ్రమైన దండన వేస్తున్న ఉన్నతాధికారులు.. సదరు ఏసీపీపై మిన్నకుంటూ పోవడం ఏమిటంటూ గుసగుసలు వినిపిస్తున్నాయి.



జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఓ మండపంలో కొలువైన దుర్గామాత

## వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం జగన్మాతను కుష్మాండ దేవి, అన్నపూర్ణా దేవి, లలితా త్రిపుర సుందరి దేవీగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. పలు ఆలయాల్లో దుర్గామాతను కుంకుమార్చనలు, పంచామృతాభిషేకాలతో పూజించారు. దేవీ మండపాల వద్ద మహిళలు కోలాటాలు, భజనలు చేస్తూ ఆధ్యాత్మికతను చాటుతున్నారు.

## జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ల నియామకం

**నిజామాబాద్‌కు అంతిరెడ్డి రాజారెడ్డి.. కామారెడ్డికి చంద్రకాంత్‌రెడ్డి**

**ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**



అంతిరెడ్డి రాజారెడ్డి



చంద్రకాంత్‌రెడ్డి

సుభాష్‌నగర్/ కామారెడ్డి అక్టోబర్ 6: రాష్ట్రంలోని పలు జిల్లాల గ్రంథాలయ సంస్థలకు చైర్మన్లను ప్రభుత్వం నియమించింది. ఇందులో భాగంగా నిజామాబాద్ గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అంతిరెడ్డి రాజారెడ్డి, కామారెడ్డి గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా చంద్రకాంత్ రెడ్డిని నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కోటగల్లీకి చెందిన అంతిరెడ్డి రాజారెడ్డి వ్యవసాయ కుటుంబం నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ కాంగ్రెస్ సీనియర్ నాయకుడిగా ప్రజల మన్ననలను పొందాడు. ఈనెల 9న చైర్మన్‌గా బాధ్యతలను స్వీకరిస్తారని గ్రంథాలయ సిబ్బంది తెలిపారు. కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం రామేశ్వరపల్లికి చెందిన చంద్రకాంత్‌రెడ్డి ఎంపీటీసీగా, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శిగా పని చేశారు. ప్రస్తుతం డీసీసీ ఉపాధ్యక్షుడిగా పనిచేస్తుండగా.. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులయ్యారు.

## నేటి నుంచి చేప పిల్లల విడుదల..

- 2.27 కోట్ల చేప పిల్లలు వదిలేలా ప్రణాళిక
- నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, అక్టోబర్ 6: మత్స్యకార కుటుంబానికి చేయూతను అందించడానికి వంద శాతం సబ్సిడీపై జిల్లాలోని ఆయా చెరువుల్లో నేటి (సోమవారం) నుంచి చేప పిల్లలను విడుదల చేయనున్నట్లు నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని 396 మత్స్య కార్మిక సహకార సంఘాల్లోని సుమారు 24 వేల మంది మత్స్యకారులకు లబ్ధి చేకూరేలా 2024–2025 ఆర్థిక సంవత్సరానికి 2.27 కోట్ల చేప పిల్లలను చెరువుల్లో విడుదల చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. వీటిలో 35 నుంచి 40 ఎం.ఎం సైజు గల చేప పిల్లలు 1.35 కోట్లు, 80 నుంచి100 ఎంఎం సైజు గల 91 లక్షల చేప పిల్లలను మత్స్య అభివృద్ధి పథకం కింద విడుదల చేసేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. చెరువుల్లో చేపలు వదిలే సమయంలో మత్స్యకార్మికులు వాటి నాణ్యతను సక్రమంగా చూసుకోవాలని సూచించారు. ఆయా చెరువులకు మంజూరు చేసిన మేరకు.. పూర్తి స్థాయిలో చేప పిల్లలు వదులుతున్నారా లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించాలని పేర్కొన్నారు. చేప పిల్లల సైజుని స్కేలు పై కొలిచి నిర్ధారించుకోవాలని సూచించారు. చేప పిల్లల విడుదల కార్యక్రమానికి మత్స్య కార్మిక సంఘాల సభ్యులు తప్పనిసరిగా హాజరై జాగ్రత్తగా చూసుకోవాలని తెలిపారు. చేప పిల్లలు, వాటి రకాల్లో ఏవైనా తేడాలు ఉంటే వెంటనే జిల్లా మత్స్య శాఖ అధికారులకు లేదా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## డీజేకు డెడ్‌లైన్

- 30లోపు అనుమతి తప్పనిసరి
- ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు చెందిన డీజేలు నిషేధం
- సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ వెల్లడి



వినాయక్‌నగర్, అక్టోబర్ 6: నిజామాబాద్ జిల్లాలో ఉన్న ప్రతి డీజే నిర్వాహకులు ఈ నెల 30లోగా లైసెన్సు, పర్మిషన్ తీసుకోవాలని సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే డీజేలను పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. ఆదివారం డీజే షాపుల యాజమాన్యాలు ఆదివారం సీపీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ డీజే నిర్వాహకులు పోలీస్ శాఖ ఇచ్చిన ఆదేశాలు పాటిస్తూ ప్రజలు, సీనియర్ సిటిజన్స్, చిన్న పిల్లలకు ఇబ్బందులు కలుగకుండా చట్ట పరిధిలో రెండు సౌండ్ బాక్స్‌లు వాడుతూ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి తీసుకువచ్చే డీజేలను పూర్తిగా నిషేధించినట్లు చెప్పారు. ఒకవేళ వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.



వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద ఫిర్యాదు కాపీని చూపిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## కాంగ్రెస్ తప్పుడు పోస్టులపై చర్యలు తీసుకోవాలి

**పోలీసులకు బీఆర్ఎస్ యువ నేతల ఫిర్యాదు**

వినాయక్‌నగర్, అక్టోబర్ 6: బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై సోషల్ మీడియా ద్వారా తప్పుడు పోస్టులు చేస్తున్న కాంగ్రెస్ నాయకులపై బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా యువ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫేక్ న్యూస్ సృష్టించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు నిజామాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. మంత్రి కొండా సురేఖ తాను చేసిన ఆరోపణలు వెనక్కి తీసుకున్నప్పటికీ , కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియాలో మాత్రం తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు అభిలాష్ రెడ్డి, వంజరి ప్రశాంత్, గంగాధర్, అమన్, జశ్వంత్‌తోపాటు పలువురు యువకులు ఉన్నారు.

## మంచుకురిసే వేళలో..



*జిల్లా కేంద్రంలో మూడు, నాలుగు రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో ఉదయం వేళ మంచు కురుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో ఉదయం 7.30 గంటల వరకు భానుడు కనిపించడంలేదు. ఆదివారం ఉదయం దట్టంగా మంచు కురువడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.*

*–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్*

## రూ.30వేలకు బాలుడి విక్రయం!

- డయల్ -100కు తండ్రి ఫిర్యాదు
- ఐదుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు



ఆర్మూర్‌టౌన్, అక్టోబర్ 6: మద్యం మత్తులో తన ఏడునెలల కొడుకును విక్రయించి.. పోలీసులకు ఫిర్యాదు చేయగా.. తండ్రితోపాటు నలుగురిపై కేసునమోదు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. నందిపేట మండలం సిద్ధాపూర్ గ్రామానికి చెందిన అంగేటి లక్ష్మి, పోశెట్టి దంపతులు. వీరు ఏడాదికాలంగా ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్‌లో భిక్షాటన చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి ఒక కుమారుడు అఖిలేశ్ (ఏడు నెలలు) ఉన్నాడు. మద్యానికి బానిసైన పోశెట్టి డబ్బుల కోసం తన కొడుకు అఖిలేశ్‌ను అమ్మకానికి పెట్టాడు. పెర్కిట్‌కు చెందిన మధ్యవర్తి మహ్మద్ గౌస్ ద్వారా ఆర్మూర్ పట్టణంలోని శాస్త్రీ నగర్‌కు చెందిన హబీబ్ ఖాన్‌కు రూ.30 వేలకు గత నెల 27న విక్రయించాడు. హబీబ్ ఖాన్ బాలుడిని తీసుకొని నిర్మల్‌లో ఉంటున్న కూతురు రషీద వద్దకు వెళ్లాడు. ఆమెకు సంతానం లేకపోవడంతో అల్లుడు మహ్మద్‌కు బాలుడిని అప్పగించి వచ్చాడు. ఈ నెల 4వ తేదీన పోశెట్టి తాగిన మైకంలో డయల్ 100 నంబర్‌కు ఫోన్ చేసి తన బాబును తనకు ఇప్పించాలని ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలోకి దిగిన నందిపేట్, ఆర్మూర్ పోలీసులు పోశెట్టిని విచారించగా బాలుడి విక్రయ ఉదంతం మొత్తం వెలుగులోకి వచ్చింది. దీంతో బాలుడి విక్రయ వ్యవహారంలో నిందితులైన తండ్రితోపాటు నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం అఖిలేశ్‌ను బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు.